తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర తొలిదశ, మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని ఉద్యమ జేఏసీ ప్రతినిధులు సి.నందకిషోర్ యాదవ్, బి.కృష్ణాగౌడ్, సుభాష్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడ, నింబోలిఅడ్డలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని, జైలు జీవితాలను గడిపారని గుర్తుచేశారు. దీంతో వందల కుటుంబాలు రోడ్డు పాలయ్యాయని వాపోయారు. 1969 తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల్లో ఇప్పటికే చాలా మంది చనిపోయారని, ప్రస్తుతం జైలు జీవితాలు అనుభవించిన వారు 100 మందిలోపే ఉంటారని తెలిపారు. ప్రసుత్తం వారి పరిస్థితి దయనీయంగా ఉందని, ఆరోగ్య, ఆర్థిక సమస్యలు వారిని వెంటాడుతున్నాయన్నారు. అలాంటి ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

గోవధను అరికట్టడంలో విఫలం


గోశాలలకు మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేస్తున్న మహేష్ అగర్వాల్

కాచిగూడ: కేవలం ఒక వర్గం ఓట్ల కోసమే గోవధను అరికట్టడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ , కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ ఆందోళన వ్యక్తం చేశారు. రోజురోజుకు గో సంతతి తగ్గుతుండటంతో రానున్న రోజుల్లో గోవులు పూర్తిగా అంతరించి పోయే ప్రమాదముందని, భవిష్యత్ తరం కేవలం గోవులను మ్యూజియాల్లో చూడాల్సిన పరిస్థితి ఎదురుకాబోతోందని ఆయన పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో శనివారం మహానంది గోశాల, శ్రీ బాలాజీ గోశాలలకు పశువుల కోసం 'మినరల్ మిక్చర్' ప్యాకెట్స్‌ను ఆయన పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ప్రేమ్‌చంద్ మునోత్, వినీత్ బుహారా, అన్‌మోల్ అగర్వాల్ పాల్గొన్నారు.

'మేలుకొన్న జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: త్వరగా ఫౌండేషన్, సాధన ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ విద్యావేత్త పి.శ్రీరామరావు రచించిన మేలుకొన్న జ్ఞాపకాలు కథల సంపుటి పుస్తకాన్ని శనివారం బాగ్ లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... సమాజాన్ని కదిలించగల ఇలాంటి పుస్తకాలు రావాలని అన్నారు. పాఠకులకు కనులకు కట్టినట్లుగా కథలు రాశారని చెప్పారు. శ్రీరామారావు రాసిన వ్యాసాల్లో పాఠకులకు ఎంతో స్ఫూర్తిని ఇస్తుందని తెలిపారు. సాధన ట్రస్ట్ ద్వారా సేవలు అందించడం అభినందనీయమన్నారు. అంబేడ్కర్ కళాశాలల చైర్మన్, ఎమ్మెల్యే జి.వివేకానంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, ఎమ్మెల్యే జి.వినోద్, రిటైర్డ్ ప్రొఫెసర్ విశ్వనాథం, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి, నిరుద్యోగులకు సీఎం భరోసా కల్పించాలి


మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులకు, నిరుద్యోగులకు భరోసా కల్పించేలా ప్రకటన చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నిరుద్యోగులకు భరోసా కల్పించే విధంగా 2 లక్షల ఉద్యోగ ప్రకటన, నూతన ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కాలేజీల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాల నిర్మాణం, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులు ఆహార మెనూకు మెస్ చార్జీల పెంపు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికీ గురుకులాల్లో ప్రవేశం కల్పించే విధంగా ఏర్పాట్లు, విద్యా హక్కు చట్టం కల్పించాలన్నారు. ప్రైవేటు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వ రంగం సంస్థలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థి నిరుద్యోగులు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కొండంత ఆశతో ఉన్నారని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలని వేముల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, నిరుద్యోగులతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రూ. 10 లక్షల గుట్కాల స్వాధీనం

కాచిగూడ: నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్న ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి సమాచారం మేరకు... తిలక్‌నగర్, సంజీవయ్య నగర్ ప్రాంతానికి చెదిన కంటి రాఘవేందర్ (36) నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్నాడు. గోదాంలో నిల్వ చేసిన వేర్వేరు బ్రాండ్లకు చెందిన రూ. 10 లక్షల విలువైన గుట్కాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని కాచిగూడ పోలీసులు విచారిస్తున్నారు.

సంగీతం-నృత్యానికి అవినాభావ సంబంధం

చిక్కడపల్లి: సంగీతం, నృత్యానికి అవినాభావ సంబంధం ఉందని రాష్ట్ర ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర అన్నారు. శనివారం రాత్రి త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికలో ప్రముఖ సాహితీ సాంస్కృతిక సంస్థ నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత రీతుల పరిశోధనాత్మక ప్రసంగ పరంపరలో భాగంగా నృత్యసంగీతంపై జరిగిన ప్రసంగ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ యువ పురస్కార గ్రహీత శ్వేతాప్రసాద్ మాట్లాడుతూ... నృత్యకళాకారులు చేస్తున్న నాట్యాంశాలను సంబంధించిన సాహిత్యాన్ని అర్థం చేసుకున్నప్పుడు నాట్యం రసభరితం అవుతుందన్నారు. జయదేవుని అష్టపదులు, దీక్షితార్ కృతులు, త్యాగయ్య కీర్తనల గురించి వివరించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు ఆనందమోహన్, విద్యారణ్యస్వామి, సుధామాల, వాణీరమణ. ఇందిరా, హేమ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

శ్రీఆంజనేయం...


అడ్వకేట్స్ కాలనీలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో మాజీ కార్పొరేటర్ రవీందర్...


చిక్కడపల్లి హనుమాన్ ఆలయంలో బీజేపీ నేత వినయ్‌కుమార్


అంబర్‌పేట సాయిబాబా ఆలయంలో కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి...


వీవీగిరి నగర్‌లో బీఆర్ఎస్ నేత ముఠా జయసింహ, శేఖర్, రాకేష్‌కుమార్, శ్రీకాంత్


ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ఆంజనేయ స్వామిని యాపిల్ పండ్లతో అలంకరించిన దృశ్యం

- అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి
- ఆంజనేయ స్వామి, లక్ష్మీగణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పాల్గొన్న ఆలయ ఈవోలు, వివిధ పార్టీల నేతలు

చిక్కడపల్లి: హనుమత్ జయంతి వేడుకలు ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. దేవాలయాలు ముఖ్యంగా ఆంజనేయస్వామి, రాములవారి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో దేవాలయాలు కిటకిటలాడాయి.

- నగరంలో ప్రసిద్ధిగాంచిన వివేక్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం, ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని లక్ష్మీగణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆంజనేయ స్వామి వారికి సింధూరాభిషేకం, ఆకుపూజ, వడమాల తదితర పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయ ఈవో మాచర్ల దేవనాథం, లక్ష్మీగణపతి ఆలయ ఈవో పి.లక్ష్మారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అర్చకులు కందాల వెంకటాద్రి, కృష్ణమూర్తి, ఆచారి, భవానందశర్మ, జగన్‌మోహనాచారి, బుచ్చిమాచారి, గోపాలాచారి, సింహం, రామాచారి, భక్తులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో...

గాంధీనగర్ డివిజన్ వీవీగిరి నగర్‌లోని హనుమాన్ ఆలయంలో హనుమత్ జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ హాజరయ్యారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, నాయకులు శ్రీకాంత్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, పున్న సత్యనారాయణ, కిరణ్‌కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి హనుమాన్ ఆలయంలో...

చిక్కడపల్లి హనుమాన్ ఆలయంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, అసోసియేషన్ సభ్యులు ప్రవీణ్, ప్రకాష్‌గౌడ్, శంకర్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. సభ్యులు శంకర్‌గౌడ్, మధుగౌడ్, సాయిందాంగౌడ్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట నియోజకవర్గంలో...

అంబర్‌పేట: హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం అంబర్‌పేట నియోజకవర్గం వ్యాప్తంగా హనుమాన్ ఆలయాల్లో ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాగ్ అంబర్‌పేట సాయిబాబా ఆలయంలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హరాస్‌పెంట ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో..


న్యూ నల్లకుంటలోని సాయిబాబా ఆలయంలో...


వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో ఈవో...

చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయండి


చెత్తను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: కుత్బిగూడ, చెప్పల్‌బజార్, మణియార్ పట్టి తదితర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ సిబ్బంది చెత్తను సరిగా ఊడ్చడం లేదని, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆరోపించారు. కాచిగూడ డివిజన్‌లోని ఆయా బస్తీల్లో ప్రజలనుంచి అందిన ఫిర్యాదు మేరకు శనివారం కార్పొరేటర్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. పేరుకుపోయిన చెత్తకుప్పలను ఎందుకు తొలగించడం లేదని కార్పొరేటర్ అధికారులను, సిబ్బందిని ప్రశ్నించారు. చెత్తను తొలగించడకపోవంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయన్నారు. పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి, రోడ్లను ప్రతి రోజూ ఊడ్వాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె అధికారులకు సూచించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. బీజేపీ నేతలు ఆర్.సంతోష్, నాగరాజు, హెచ్.రవి, సందీప్, గోపి, పటేల్, శ్యామ్, ఉపేందర్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం


బ్రహ్మకుమారి సిస్టర్ సరోజను సత్కరిస్తున్న పెండ్యాల నర్సింగ్ రావు

కాచిగూడ: బ్రహ్మకుమారీస్ 24వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా శనివారం లోక్‌జనశక్తి పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు పెండ్యాల నర్సింగ్‌రావు బ్రహ్మకుమారీ సరోజ సిస్టర్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ అనిత అక్కయ్య, స్వరాజ్య లక్ష్మీ, వినోద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం


రాంనగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు తదితరులు

ముషీరాబాద్: అమరవీరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం రాంనగర్ చౌరస్తా వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ తన ప్రాణాలకు తెగించి రాష్ట్ర సాధన కోసం పోరాడిన గొప్ప నాయకుడని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ వల్లే ఏర్పడిందన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు అజయ్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, నర్సింగ్‌ముదిరాజ్, బాలరాజ్‌గౌడ్, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు సదా, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ...

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ముషీరాబాద్ నుంచి బయలుదేరిన పార్టీ నాయకులు గన్‌పార్కు వద్ద ఉన్న అమరవీరుల స్థూపం వరకు తరలివెళ్లి నివాళులు అర్పించారు.

సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం...

ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్ మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. శనివారం ముషీరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఆదివారం ముషీరాబాద్‌లో ఘనంగా నిర్వహిస్తామన్నారు. జెండా ఆవిష్కరణ, సేవా కార్యక్రమాలు నిర్వహించి సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌కు తరలివెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తామని తెలిపారు.


ముషీరాబాద్ చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జీరో ఎఫ్ఐఆర్ బదిలీ

కాచిగూడ: రాయితో ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో మహబూబ్‌నగర్ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... హన్మకొండకు చెందిన జోమాటో ఉద్యోగి చరణ్ (22) మే 16న కాచిగూడ నుంచి మైసూర్ వెళుతున్నాడు. ఉప్పుగూడ రైల్వే స్టేషన్ వద్ద కొంత మంది అకతాయిలు రైలుపై విసిరిన రాయి తగిలి ముక్కుకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు మహబూబ్‌నగర్ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు.

సెల్ ఫోన్ స్నాచింగ్...

ఓ వ్యక్తి సెల్‌ఫోన్ చోరీకి గురైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగి రంగ నరేందర్ తన కొడుకు లక్ష్మీనారాయణను చెన్నైన ఎగ్మోర్ రైలును ఎక్కించడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. రైల్వే స్టేషన్‌లో టికెట్ తీసుకునే సమయంలో టికెట్ కౌంటర్ వద్ద అతని సెల్‌ఫోన్ చోరీకి గురైంది. శనివారం బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసుల జీరో ఎఫ్ఐఆర్

బంగారు బ్రాస్‌లెట్, ఉంగరం ఉన్న ట్రాలీ బ్యాగు చోరీకి గురైన సంఘటన పై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... రాజమండ్రికి చెందిన మోహన్‌రావు కూతురు వాణి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. శుక్రవారం అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో నాగర్‌సోల్ నుంచి కాచిగూడకు వస్తోంది. రైలు కామారెడ్డి స్టేషన్ వద్ద ఉండగా 16 గ్రాముల బ్రాస్‌లెట్, ఉంగరం, డాక్యుమెంట్లు ఉన్న ట్రాలీ బ్యాగు కనబడలేదు. శనివారం బాధితురాలు కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు జీరోఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

వర్షాకాలంలో అత్యవసర సేవలందించే బృందాలు సిద్ధం


అత్యవసర బృందాలను ప్రారంభిస్తున్న జోనల్ కమిషనర్ రవికిరణ్

అంబర్‌పేట: వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కారించేందుకు సిద్ధంగా ఉండాలని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ సూచించారు. నాలా సమస్యలు, చెట్లు కూలడం, రోడ్లపై భారీగా నీరు నిలవడం, మట్టి పేరుకపోవడంతో పాటు అకస్మాత్తుగా వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కారించేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. శనివారం గోల్నాకలో పనిచేసే ఆరు బృందాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అంబర్‌పేట సర్కిల్‌లో ఉన్న ప్రతి డివిజన్‌కు ఒక బృందం ఉంటుందని అందులో ఒక వాహనంతో పాటు కావాల్సిన సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. వర్షాకాలంలో తలెత్తే సమస్యలపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సేవల్లో విధులు నిర్వహిస్తు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. డీఎంసీ మారూతీదివాకర్, ఈఈ పేర్రాజు, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

'గజల్ ప్యారడైజ్' పుస్తకావిష్కరణ


గజల్ ప్యారడైజ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ కవి ఇనుకుర్తి లక్ష్మణాచారి రచించిన గజల్ ప్యారడైజ్ వ్యాస సంపుటిని తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవి, రచయిత డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. గజల్ ప్యారడైజ్ ప్రతి ఒక్కరు చదవగల పుస్తకం అని వీరిలో ఎంతో స్ఫూర్తిదాయకమైన కథలు ఉన్నాయని తెలిపారు. అనంతోజు మోహనకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ బి.బాలకృష్ణ, తెలంగాణ సాహితీ కార్యదర్శి కె.ఆనందచారి, డాక్టర్ పోతగాని సత్యనారాయణ, డాక్టర్ తిరునగరి శరత్‌చంద్ర, తెల్లాకుల కోటేశ్వర్‌రావు, కనపర్తి శ్రీదేవి, సయ్యద్ ముజాహిద్ ఆలీ, ఇనుకుర్తి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి


అన్నదానం చేస్తున్న బీజేపీ నేత వినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ అన్నారు. శనివారం వివేక్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో హనుమజ్జయంతి సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు పి.రోహిత్‌కుమార్, రవీందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... అన్ని దానాలలోకంటే అన్నదానం గొప్పదని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని ప్రోత్సహించాలని అన్నారు. సినీనటుడు మాణిక్, స్థానిక నాయకులు ఆకుల శ్రీనివాస్, గణేష్, జోలి విజయకుమార్, జానకి సుధాకర్, శ్యాంసుందర్‌ముదిరాజ్, రాకేష్‌కుమార్, రవి శంకర్‌గుప్తా, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.